# స్వల్పకాలంలో

# 18306 వద్ద నిరోధం




**సమీక్ష:** గత వారం మార్కెట్ స్థిరీకరణ దిశలో పయనించింది. కేవలం 23 పాయింట్ల లాభాన్ని మాత్రమే సెన్సెక్స్ పొందింది. ప్రారంభంలో మార్కెట్ సానుకూలంగానే ఉంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఇందుకు అంతర్జాతీయ మార్కెట్లూ సహకరించాయి. దీంతో సెన్సెక్స్ రెండు న్నరేళ్ల గరిష్ఠ స్థాయి 18309కి చేరింది. తర్వాత అధిక స్థాయుల వద్ద లాభాల స్వీకరణ జరిగింది. బయటి దేశాల్లో ఏర్పడ్డ ప్రతికూలతలు బలహీనతకు దారితీశాయి. జూన్‌లో పారిశ్రామికాభివృద్ధి అంత క్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 11.50శాతం నుంచి 7.10 శాతానికి తగ్గింది. దీనికితోడు జులై 31తో ముగిసిన వారానికి ఆహార ద్రవ్యోల్బణం కాస్త హెచ్చి 9.53% శాతంగా నమోదవడంతో గురువారానికల్లా మార్కెట్ 17914కు పడిపోయింది. అయితే విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) తమ కొనుగోలు ధోరణిని కొనసాగించడంతో 18167 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐలు రూ.2026 కోట్ల నికర కొనుగోళ్లు చేయడం విశేషం. మ్యూచువల్ ఫండ్లు రూ.612 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** స్థిరాస్తి, మన్నికైన వినిమయ వస్తువుల సూచీల్లో కొనుగోళ్లు కొనసాగాయి. అత్యధిక లాభాలను ఆర్జించాయవి. అంచనా వేసిన దానికంటే మెరుగైన ఫలితాల కారణంగా బ్యాంకింగ్ షేర్ల రేటింగ్ పెరిగింది కూడా. అంతర్జాతీయ మార్కెట్ల బలహీనతలు, వీసా ప్రాసెసింగ్ ఫీజుల పెంపు అంచనాలు ఐటీ షేర్లను డీలా పడేలా చేశాయి. ఆరోగ్యం సంరక్షణ, లోహ రంగాలు వరుసగా రెండో వారమూ అత్యధిక నష్టాలను పొందాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి వరుసగా రెండో వారమూ 1:1 నిష్పత్తితో తటస్థంగానే నమోదైంది.

**భవిష్యత్ అంచనా:** సెన్సెక్స్ స్థిరీకరణ దశలో ఉంది. 18288 స్థాయిపైన ముగిస్తే స్వల్పకాలంలో మార్కెట్ పై స్థాయులకు పయనించవచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మరో పక్క 18070 కింద స్థిరపడితే మాత్రం దిద్దుబాటుకు అవకాశాలుంటాయి.

**ప్రభావితం చేసే అంశాలు:** ద్రవ్యోల్బణ గణాంకాలు; రుతుపవనాల ప్రగతి; రాష్ట్ర జీఎస్‌టీ ప్యానెల్, ఆర్థిక మంత్రిల మధ్య సవరించిన జీఎస్‌టీ ముసాయిదాపై జరిగే చర్చ ఫలితం ; ప్రత్యక్ష పన్నుల స్మృతి(డీటీసీ)పై జరిగే పరిణామాలు; అమెరికా గృహ, పారిశ్రామిక, నిరుద్యోగ గణాంకాలు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18000, 17914, 17800; **తక్షణ నిరోధ స్థాయిలు: 18306, 18491, 18636**

**స్వల్పకాలంలో మార్కెట్‌కు 18306 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని అంచనా.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*